మహిళా పోలీస్‌స్టేషన్‌ను సందర్శించి సిబ్బందికి సలహాలు, సూచనలిస్తున్న ఎస్పీ నారాయణరెడ్డి

మహిళల భద్రతకు అత్యంత ప్రాధాన్యం

◆ ఎస్పీ నారాయణరెడ్డి

◆ వికారాబాద్‌లోని మహిళా పోలీస్ స్టేషన్‌ను సందర్శించి సమీక్ష

వికారాబాద్, ఏప్రిల్ 28 : మహిళల భద్రతకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతనిస్తున్నదని, మహిళా పోలీస్‌స్టేషన్‌ను సమర్థవంతంగా నిర్వహించాలని ఎస్పీ నారాయణరెడ్డి తెలిపారు. సోమవారం వికారాబాద్‌లోని మహిళా పోలీస్ స్టేషన్‌ను ఆయన సందర్శించారు. స్టేషన్ పరిసరాలను పరిశీలించి, శుభ్రత, భద్రతాపరంగా తీసుకుంటున్న చర్యలను సమీక్షించారు. అనంతరం స్టేషన్‌లో ఉన్న రికార్డులను పరిశీలించి, నిర్వహణలో మెరుగుదల కోసం అవసరమైన సూచనలు అందించారు. పోలీస్‌స్టేషన్‌కు వచ్చిన ఫిర్యాదుదారులతో ప్రత్యక్షంగా మాట్లాడి, వారి సమస్యలను తెలుసుకున్నారు. ఫిర్యాదులపై త్వరితగతిన స్పందించి బాధితులకు న్యాయం కల్పించాలని పోలీసు అధికారులను ఆదేశించారు. అనంతరం ఎస్పీ స్టేషన్ సిబ్బందితో సమావేశమై, డ్యూటీ నిర్వహణలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, చేయకూడని పనుల గురించి వివరించారు. ప్రజలతో స్నేహంగా వ్యవహరించి, మహిళల సంబంధిత సమస్యలపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. ప్రతి ఫిర్యాదును సకాలంలో విచారించి, నిబంధనల ప్రకారం చట్టబద్ధమైన చర్యలు తీసుకోవాలన్నారు. విధి నిర్వహణలో క్రమశిక్షణ, సమయపాలన కచ్చితంగా పాటించాలని ఎస్పీ పేర్కొన్నారు. కార్యక్రమంలో మహిళా పోలీస్‌స్టేషన్ సీఐ శివచంద్ర, ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి శంకర్

ప్రతి విద్యార్థి పాస్ అయ్యేలా చర్యలు తీసుకోవాలి

జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి శంకర్

వికారాబాద్, ఏప్రిల్ 28 : ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షల్లో ప్రతి విద్యార్థి పాస్ అయ్యేలా చర్యలు తీసుకోవాలని జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి శంకర్ అన్నారు. సోమవారం జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి కార్యాలయంలో ప్రభుత్వ జూనియర్ కళాశాలల ప్రిన్సిపాళ్ల తో సమావేశం నిర్వహించి ఇంటర్ పబ్లిక్ పరీక్షల ఫలితాలను సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షల్లో ప్రతి సబ్జెక్టులో 100% ఉత్తీర్ణత సాధించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ నెల 30లోగా పరీక్ష ఫీజు చెల్లించడానికి ప్రిన్సిపాళ్లు తగు చర్యలు తీసుకోవాలన్నారు. ఫెయిలైన విద్యార్థులకు ఉపన్యాసకులు తగు మార్గదర్శనం చేయాలన్నారు. గత సంవత్సరంతో పోలిస్తే ఈ సంవత్సరం జిల్లాస్థాయి ఫలితాలు మెరుగుపడ్డాయన్నారు. మార్చి నెలలో పరీక్షలను విజయవంతంగా నిర్వహించిన సిబ్బందిని అభినందించారు. అనంతరం కళాశాలల వారీగా ఫలితాలను సమీక్షించారు. కళాశాలల్లో అడ్మిషన్లు పెంచడానికి ప్రిన్సిపాళ్లు, ఉపన్యాసకులు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో తాండూరు ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ మల్లినాథప్ప, ఉపన్యాసకులు, ఆఫీస్ సిబ్బంది పాల్గొన్నారు.

పరీక్ష ఫీజు తేదీ గడువు పెంపు ఉండదు

పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు ఈ నెల 30 వరకు పరీక్ష ఫీజును సంబంధిత కళాశాలలో ఎలాంటి అపరాధ రుసుము లేకుండా చెల్లించవచ్చునని తెలిపారు. విద్యార్థుల తల్లిదండ్రులు, సంబంధిత కళాశాలల ప్రిన్సిపాళ్లు పరీక్ష ఫీజు త్వరగా చెల్లించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ నెల 30 తర్వాత ఫీజు చెల్లించడానికి ఫీజు తేదీ గడువు పెంపు ఉండదని ఆయన స్పష్టం చేశారు. విద్యార్థులు దీన్ని దృష్టిలో ఉంచుకొని ఫీజు చెల్లించాలని ఆయన పేర్కొన్నారు.

ఆర్ఎన్ఆర్ కాలనీలో మళ్లీ మంటలు

గుడిసెలకు అంటుకున్న మంటలను ఆర్పుతున్న స్థానికులు

పెద్దఅంబర్‌పేట, ఏప్రిల్ 28 : మున్సిపాలిటీ పరిధి కుంట్లూరు రావినారాయణరెడ్డి కాలనీలోని గుడిసెల్లో సోమవారం మధ్యాహ్నం మళ్లీ మంటలు చెలరేగాయి. రెండ్రోజుల కిందటే కాలనీలో జరిగిన ప్రమాదంలో 200లకు పైగా గుడిసెలు దగ్ధమైన విషయం తెలిసిందే. ఆ ప్రమాదం నుంచి కోలుకోకముందే మళ్లీ గుడిసెల్లో మంటలు చెలరేగాయి. దాదాపు 10 గుడిసెలు మంటల్లో కాలి బూడిదయ్యాయి. గ్యాస్ సిలిండర్ పేలడం వల్లే ప్రమాదం జరిగినట్టు స్థానికులు చెబుతున్నారు. స్థానికులు వెంటనే స్పందించి, పెద్దఎత్తున బకెట్లు, గిన్నెలతో నీళ్లు చల్లి మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. అగ్నిమాపక సిబ్బంది చేరుకుని మంటలను ఆర్పేశారు.

అన్ని భూ సమస్యలకు పరిష్కారం

సదస్సులో మాట్లాడుతున్న కలెక్టర్ నారాయణరెడ్డి. చిత్రంలో ఎమ్మెల్యే రంగారెడ్డి

❍ కలెక్టర్ నారాయణరెడ్డి

❍ భూ భారతి చట్టంపై పెద్దఅంబర్‌పేటలో అవగాహన సదస్సు

పెద్దఅంబర్‌పేట, ఏప్రిల్ 28 : రైతులు, భూ యజమానులకు భూభారతి చట్టం మేలు చేస్తుందని కలెక్టర్ నారాయణరెడ్డి అన్నారు. సోమవారం పెద్దఅంబర్‌పేటలోని తారా కన్వెన్షన్‌లో భూ భారతి చట్టంపై అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భూ భారతి చట్టం అన్ని భూ సమస్యలకు ఏదో ఒక దశలో పరిష్కారం చూపుతుందని చెప్పారు. హక్కుల రికార్డుల తప్పుల సవరణకు ఈ చట్టంలో అవకాశం కల్పించారని తెలిపారు. భూమి ఉన్న ప్రతి రైతుకూ భూభద్రత, శాశ్వత పరిష్కారం చూపిస్తామన్నారు. సామాన్య రైతులకు అర్థమయ్యేలా భూ భారతి పోర్టల్‌ను రూపొందించడం జరిగిందన్నారు. రైతాంగానికి భరోసానిస్తూ, భద్రత కల్పించడమే లక్ష్యంగా చట్టం తీసుకొచ్చారన్నారు. రిజిస్ట్రేషన్, మ్యుటేషన్‌కు ముందే భూ సర్వే, మ్యాప్ తయారీ ద్వారా భవిష్యత్తులో ఎలాంటి సమస్యలు వచ్చే అవకాశం కూడా ఉండదన్నారు. చట్టంపై రైతులకు ఉచిత న్యాయ సాయం అందిస్తామని చెప్పారు. పాసు పుస్తకాల్లోనే భూమి పటం ద్వారా భూములు ఎవరికి ఎక్కడున్నాయో అనే విషయంపై స్పష్టత వస్తుందని పేర్కొన్నారు. చట్టంలో రెండంచెల అప్పీళ్లకు అవకాశం ఇవ్వడం ద్వారా అర్హులందరికీ న్యాయం జరుగుతుందన్నారు. భూ సర్వే విభాగాన్ని బలోపేతం చేసేందుకు ప్రభుత్వం తగు చర్యలు తీసుకుంటున్నదని తెలిపారు. సదస్సుకు నెదర్లాండ్స్ మాజీ మంత్రి జాన్ పోర్ట్ హాజరయ్యారు. చట్టాల గురించి అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి, ఇబ్రహీంపట్నం ఆర్డీవో అనంతరెడ్డి, అబ్దుల్లాపూర్‌మెట్ తహసీల్దార్ సుదర్శన్‌రెడ్డి, ఎంపీడీవో శ్రీవాణి, కమిషనర్ రవీందర్‌రెడ్డి, గడ్డి అన్నారం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ మధుసూదన్‌రెడ్డి, వైస్ చైర్మన్ భాస్కర్‌చారి, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

ఎల్కతుర్తి సభతో కాంగ్రెసోళ్లకు మతిపోయింది

విలేకరుల సమావేశంలో రాష్ట్ర సహకార సంఘాల కార్పొరేషన్ మాజీ చైర్మన్ రాజావరప్రసాద్

షాద్‌నగర్, ఏప్రిల్ 28 : బీఆర్ఎస్ పార్టీ రజతోత్సవ వేడుకల్లో భాగంగా వరంగల్ ఎల్కతుర్తిలో నిర్వహించిన కేసీఆర్ బహిరంగ సభ జన సముద్రాన్ని చూసి కాంగ్రెసోళ్లకు మతిపోయిందని రాష్ట్ర సహకార సంఘాల కార్పొరేషన్ మాజీ చైర్మన్ రాజావరప్రసాద్ తీవ్రస్థాయిలో మండిపడ్డారు. సోమవారం షాద్‌నగర్‌లోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మాజీ సీఎం కేసీఆర్‌ను ఉద్దేశించి ఇష్టానుసారంగా మాట్లాడం సరికాదని, తెలంగాణ ప్రజల చిరకాల వాంఛను నెరవేర్చిన గొప్ప వ్యక్తి కేసీఆర్‌ను విమర్శించే స్థాయి ఆయనకు లేదన్నారు. ప్రభుత్వంలో ఉంటూ అభివృద్ధిపై దృష్టి పెట్టకుండా, ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా స్థాయి మర్చి ఆరోపణలు చేయడం దిగజారుడుతనానికి నిదర్శనమని మండిపడ్డారు. రేవంత్‌రెడ్డికి ఊడిగం చేసుకుంటే చేసుకో కానీ కేసీఆర్‌ను విమర్శిస్తే చూస్తు ఊరుకోబోమని హెచ్చరించారు. 420 హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ ఏ ఒక్క హామీని కూడా నెరవేర్చకుండా కాలయాపన చేస్తున్నదని, తులం బంగారం, విద్యార్థినులకు స్కూటీలు, మహాలక్ష్మి పథకం ద్వారా రూ.2500, వృద్ధులకు రూ.4000 పింఛన్లు వంటి పథకాలు అమలు చేసి చూపాలని సవాల్ విసిరారు. సమావేశంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు లక్ష్మణ్‌నాయక్ ఉన్నారు.

విలేకరులతో మాట్లాడుతున్న రాజావరప్రసాద్

ఫిర్యాదులను స్వీకరిస్తున్న జిల్లా అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్

ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలి

జిల్లా అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్

ఆదిబట్ల, ఏప్రిల్ 28 : ప్రజావాణిలో ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలని రంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్ అన్నారు. సోమవారం రంగారెడ్డి జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణిలో ఆమె జిల్లా రెవెన్యూ అధికారి సంగీత తో కలిసి ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఫిర్యాదుల సత్వర పరిష్కారానికి కృషి చేయాలన్నారు. అర్జీలను పెండింగ్‌లో పెట్టవద్దని అధికారులను ఆదేశించారు. ప్రజావాణిలో రెవెన్యూ, ఇతర శాఖలకు సంబంధించి 51 దరఖాస్తులు వచ్చాయని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా అధికారులు, మున్సిపల్ అధికారులు, తహసీల్దార్‌లు, కలెక్టరేట్ అధికారులు పాల్గొన్నారు.

గున్‌గల్ గేటు వద్ద ఆందోళన చేస్తున్న మృతుడి కుటుంబసభ్యులు

న్యాయం చేయాలి

❑ హోంగార్డు మృతిపై సాగర్ రహదారిపై కుటుంబసభ్యులు, బంధుమిత్రుల ఆందోళన

❑ భారీగా ట్రాఫిక్ జామ్.. పోలీసుల జోక్యంతో సద్దుమణిగిన ఆందోళన

యాచారం, ఏప్రిల్ 28 : మండలంలోని గున్‌గల్ గ్రామంలో జరిగిన డ్రైనేజీ గొడవలో ఓ హోంగార్డు ఆదివారం ప్రాణాలు కోల్పోయిన విషయం తెలిసిందే. గున్‌గల్ గ్రామానికి చెందిన మేడిపల్లి వెంకటేశ్(35)కు డ్రైనేజీ పంచాయితీలో ఇరుగు పొరుగువారితో ఘర్షణ జరిగింది. వెంకటేశ్‌పై గ్రామానికి చెందిన ప్రశాంత్, పవన్, యాదమ్మ దాడి చేయగా అతడు అస్వస్థతకు గురై కుప్పకూలాడు. అతడిని చికిత్సకు తరలిస్తుండగా ప్రాణాలు కోల్పోయాడు. దీంతో వెంకటేశ్ కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు కోపోద్రిక్తులై నిందితుల ఇంటిపై దాడి చేశారు. సోమవారం సాయంత్రం గున్‌గల్ గేటు వద్ద మృతుడి భార్య వెంకటేశ్ భార్య స్వాతి తన పిల్లలతో కలిసి సాగర్ రహదారిపై బైఠాయించి ఆందోళన చేపట్టారు. వీరికి మద్దతుగా బంధుమిత్రులు, గ్రామస్తులు పెద్దసంఖ్యలో రాస్తారోకో చేపట్టారు. మృతుడి కుటుంబానికి న్యాయం చేయాలంటూ నినాదాలు చేశారు. దీంతో హైదరాబాద్-నాగార్జునసాగర్ రహదారిపై వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. వెంకటేశ్ కుటుంబానికి న్యాయం చేసేదాక ఇక్కడి నుంచి కదిలేది లేదని స్పష్టం చేశారు.

విషయం తెలుసుకున్న ఇబ్రహీంపట్నం ఏసీపీ కేపీవీ రాజు, హైదరాబాద్ గ్రీన్ ఫార్మా సిటీ పీఎస్ సీఐ కృష్ణంరాజు, యాచారం ఎస్ఐ మధు తమ సిబ్బందితో అక్కడికి చేరుకొని ఆందోళనకారులతో మాట్లాడారు. సమస్యను శాంతియుతంగా పరిష్కరించుకోవాలని, ఆందోళనతో వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడిందని, శాంతిభద్రతలకు విఘాతం కలిగించొద్దని ఏసీపీ రాజు సూచించారు. అయినప్పటికీ ఆందోళనకారులు వినకపోవడంతో పోలీసులు లాఠీలకు పని చెప్పాల్సి వచ్చింది. దీంతో అక్కడ ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. వెంకటేశ్ కుటుంబానికి న్యాయం చేసేందుకు అన్ని విధాలుగా కృషి చేస్తామని పోలీసులు హామీ ఇవ్వడంతో పరిస్థితి సద్దుమణిగింది. వాహనాలను దారి మళ్లించి పోలీసులు ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు.

ఆందోళనకారులతో మాట్లాడుతున్న ఏసీపీ కేపీవీ రాజు

దోపిడీ దొంగల బీభత్సం

◆ కాపలాదారులపై కత్తులతో దాడి

◆ 30 గొర్రెలు అపహరణ

హయత్ నగర్, ఏప్రిల్ 28 : గొర్రెల మందకు కాపలాదారులుగా పడుకున్న ఇద్దరిపై దోపిడీ దొంగలు కత్తులతో దాడికి పాల్పడ్డారు. ఈ ఘటనలో గొర్రెల మంద కాపలాదారు, కానిస్టేబుల్ కు తీవ్ర గాయాలయ్యాయి. మరొక వ్యక్తి స్వల్పంగా గాయపడ్డారు. గొర్రెల మంద నుంచి 30 గొర్రెలను దొంగలు అపహరించారు. ఈ ఘటన హయత్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో సోమవారం తెల్లవారు జామున చోటుచేసుకుంది. పోలీసులు, బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. అబ్దుల్లాపూర్‌మెట్ మండలం, తుర్కయంజాల్ మున్సిపాలిటీ పరిధిలోని కోహెడ గ్రామానికి చెందిన రాసూరి నవీన్ కుషాయిగూడ పోలీస్ స్టేషన్ లో కానిస్టేబుల్. తండ్రి శ్రీశైలంకు 250 గొర్రెలు ఉన్నాయి. ఆదివారం రాత్రి నవీన్, బావమరిది శ్రీకాంత్ తో కలిసి గ్రామ సమీపంలోని సంపత్ బాల్‌రెడ్డి పొలంలో ఉన్న గొర్రెల మంద వద్దకు వచ్చి పడుకున్నారు. సోమవారం తెల్లవారుజామున దాదాపు 10 మంది గుర్తుతెలియని వ్యక్తులు బొలెరో వాహనంలో వచ్చారు. వెంటనే వారి వద్ద ఉన్న సెల్ ఫోన్లను, రూ .5 వేలు నగదును లాక్కున్నారు. నవీన్ పై కత్తులతో దాడి చేయగా అతడి కుడి కన్ను, తలపై, కుడి భుజం వెనుక భాగాల్లో తీవ్రంగా గాయాలయ్యాయి. శ్రీకాంత్ మొహంపై దాడి చేయడంతో అతడి కుడికన్ను, ఇతర భాగాల్లో గాయాలయ్యాయి. బొలెరో వాహనంలో 30 గొర్రెలను ఎత్తుకెళ్లారు. విషయం తెలుసుకున్న హయత్ నగర్ పోలీసులు హుటాహుటిన సంఘటన స్థలానికి చేరుకొని పరిశీలించారు. తీవ్రంగా గాయపడ్డ వారిని నవీన్, శ్రీకాంత్‌లను ఎల్బీనగర్ లోని కామినేని ఆసుపత్రికి తరలించారు. దొంగల ముఠాను త్వరలోనే పట్టుకొని అరెస్టు చేస్తామని సీఐ నాగరాజు గౌడ్ తెలిపారు. బాధితుడు నవీన్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

దొంగల దాడిలో తీవ్రంగా గాయపడిన కానిస్టేబుల్ నవీన్

మూగ జీవాలకు రక్షణేదీ..!

సిటీబ్యూరో : నగర శివారుల్లో మూగ జీవాలకు రక్షణ కరువైంది. శివారులో ఉండే గొర్రె కాపర్లకు దొంగల భయం రోజురోజుకు పెరుగుతుంది. కొహెడ గ్రామ శివారులో సోమవారం తెల్లవారుజామున దొంగల బీభత్సం గొర్లకాపరుల్లో మరింత భయాన్ని నింపింది. ఇల్లు వదిలి రాత్రి సమయంలో గొర్రెలు, మేకల మందల వద్ద కాపలా కాసే వారు బిక్కుబిక్కుమంటూ జీవనం సాగించాల్సిన పరిస్థితి ఏర్పడుతున్నది. పశువుల దొంగలపై కఠిన చర్యలు తీసుకోకపోవడంతో దొంగల ముఠాలు చెలరేగిపోతున్నాయంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఔటర్ రింగ్ రోడ్డు లోపల బయట రాచకొండ, సైబరాబాద్ కమిషనర్ల పరిధిలో ఈ దొంగతనాలు తరచుగా జరుగుతున్నాయి. కొహెడ వద్ద చోటుచేసుకున్న ఘటనలో బాధితుడైన గొర్రెల యజమాని కొడుకు వృత్తిరీత్యా కానిస్టేబుల్ అయినా దొంగలు ఏమాత్రం భయపడకుండా దాడి చేసి గొర్రెలను మేకలను ఎత్తుకెళ్లారు. చేవెళ్ల, పటాన్‌చెరు, ఇబ్రహీంపట్నం తదితర ప్రాంతాల్లో గొర్రెలు మేకల మందలపై దొంగల ముఠాలు ఎప్పుడూ కన్నేసి ఉంచుతాయంటూ చెబుతున్నారు. ఈ ముఠాలను పట్టుకోవాలని బాధితులు కోరుతున్నారు. బాధితులిచ్చిన సమాచారంతో ఆయా వాహనాల రూట్‌లను గుర్తించేందుకు శివారులో ఉన్న సీసీ కెమెరాలను రాచకొండ పోలీసులు పరిశీలిస్తున్నారు. ఈ ముఠాలు పూర్తి హిందీలో మాట్లాడడంతో హైదరాబాద్ ఓల్డ్ సిటీ చెందినవాళ్లా.. లేక ఇతర రాష్ట్రాలకు చెందిన దొంగల అనే అంశాలపై పోలీసులు విశ్లేషిస్తున్నారు. తెలంగాణతోపాటు పొరుగు రాష్ట్రాల్లో ఇటీవల ఇలాంటి దొంగతనాలు జరిగాయా జరిగితే ఆయన దొంగతనాల పాల్పడిన ముఠాలు ఎక్కడివి? అనే సమాచారాన్ని సేకరిస్తున్నారు. ప్రత్యేక బృందాలను రంగంలోకి దింపి ఓఆర్ఆర్ ఎగ్జిట్‌ల ఎంట్రీ పాయింట్ల వద్ద దొంగతనం జరిగిన సమయంలో ఆ రూట్లో వెళ్లిన బొలెరో వాహనాల వివరాలను పోలీసులు సేకరిస్తున్నారు.

నిర్వహణలో నిర్లక్ష్యం

❍ కులకచర్ల మండలంలో పనిచేయని సీసీ కెమెరాలు

❍ గతంలో గ్రామగ్రామాన సీసీ కెమెరాల ఏర్పాటుకు చర్యలు తీసుకున్న అప్పటి ఎస్ఐలు

❍ నేడు వాటి గురించి పట్టించుకోని పోలీసులు

❍ ఇదే అదనుగా రెచ్చిపోతున్న దొంగలు

❍ ఇంత జరుగుతున్నా మండలంపై దృష్టి పెట్టని జిల్లా పోలీసు అధికారులు

కులకచర్లలో పనిచేయని సీసీ కెమెరాలు

కులకచర్ల, ఏప్రిల్ 28 : 'సీసీ కెమెరాలతో నేరాలను కొంతమేరకు తగ్గించవచ్చు.. నేరాల అదుపుపకు సీసీ కెమెరాలు సహాయపడతాయి.. ఒక్క సీసీ కెమెరా 100 మంది పోలీసులతో సమానం..' ఇది నాటి పోలీసు ఉన్నతాధికారుల మాటలు. నిఘా నేత్రాలతో నేరాలను అదుపు చేయవచ్చునని నాటి జిల్లా ఎస్పీ గ్రామగ్రామాన సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలని అన్ని మండలాల ఎస్ఐలను ఆదేశించారు. అప్పట్లో కులకచర్ల మండలంలో చాలా గ్రామాల్లో ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలు, సర్పంచుల సహకారంతో ఎస్ఐలు సీసీ కెమెరాలను ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకున్నారు. వికారాబాద్ జిల్లాలోనే అప్పట్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసే మండలంగా మంచి గుర్తింపు కూడా వచ్చింది. కాని నాడు ఏర్పాటు చేసిన నిఘనేత్రాలను ప్రస్తుతం ఉన్న పోలీసులు పట్టించుకోక పోవడంతో నిర్వహణ లేక నిరుపయోగంగా మారాయి. కులకచర్లలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను కులకచర్ల పోలీస్టేషన్‌లో కూర్చొని పర్యవేక్షణ చేసే ఏర్పాటు చేశారు. దీంతో నేరాలను త్వరితగతిన గుర్తించి నేరగాళ్లను పట్టుకున్న సంఘటనలు ఉన్నాయి. కాని నాటి పోలీసులు బదిలీపై వెళ్లడంతో కొత్తగా వచ్చినవారు సీసీ కెమెరాలపై దృష్టి పెట్టకపోవడంతో నిరుపయోగంగా మారాయి. అప్పట్లో ఉన్న ఎస్ఐ సీసీ కెమెరాలను నిర్వహించేందుకు నిర్వాహకుడిని కూడా ఏర్పాటు చేశారు. ప్రస్తుతం ఆ పరిస్థితి లేకపోవడంతో దొంగలు రెచ్చిపోతున్నారని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నాడు కులకచర్ల మండల కేంద్రంలో పెద్ద గేటు చౌరస్తాతో పాటు ఇతర చౌరస్తాలలో, చిన్న గేటు, గ్రామాల్లోని ప్రధాన రహదారులు, చౌరస్తాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. వీటి సహాయంతో పోలీసులు అనుమానిత వాహనాల రాకపోకలు, అనుమానితుల సంచారం, ట్రాఫిక్ పోలీసుల పని తీరును పరిశీలించేవారు. కాని ఇప్పుడు సీసీ కెమెరాల నిఘా లేకపోవడంతో నేరగాళ్లు విజృంభిస్తున్నారు. పోలీసు ఉన్నతాధికారులు స్పందించి గతంలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను తిరిగి పనిచేసేలా చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

అన్ని గ్రామాల్లో సీసీ కెమెరాల ఏర్పాటుకు చర్యలు

కులకచర్ల మండలంలోని అన్ని గ్రామాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసేందుకు గ్రామాల్లో అవగాహన కల్పిస్తున్నాం. గతంలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు మరమ్మతులు లేక పనిచేయడం లేదు. వాటిని సరిచేయించాలి.. లేకుంటే వాటి స్థానంలో కొత్తవి ఏర్పాటు చేయాలి. ఇప్పటికే బండవెల్కిచర్ల గ్రామంలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకునేందుకు గ్రామస్తులకు అవగాహన కార్యక్రమాన్ని కూడా నిర్వహించాం.

- అన్వేశ్‌రెడ్డి, ఎస్ఐ, కులకచర్ల

మైసమ్మ తల్లి భూముల జోలికి రావొద్దు

సర్వేను అడ్డుకున్న నారాయణపూర్ గ్రామస్తులు

వికారాబాద్, ఏప్రిల్28 : భక్తుల కోరికలు తీర్చే బంగారు మైసమ్మతల్లి ఉన్న భూమి జోలికి వస్తే ఊరుకోబోమని నారాయణపూర్ గ్రామస్తులు హెచ్చరించారు. సోమవారం వికారాబాద్ మండలం నారాయణపూర్ గ్రామ పరిధిలో ఉన్న బంగారు మైసమ్మ ఆలయ సమీపంలో ఉన్న భూమిని సర్వే చేస్తుండగా గ్రామస్తులు అడ్డుకున్నారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ.. నారాయణపూర్‌లో సర్వే నం.139లో చాలా పరకు ప్రభుత్వ భూమి ఉంది. ఆ సర్వే నంబర్‌లోనే ప్రసిద్ధిగాంచిన మైసమ్మ తల్లి ఆలయం ఉందన్నారు. వికారాబాద్ పట్టణానికి చెందిన ఎక్స్ సర్వీస్ మ్యాన్‌కు ప్రభుత్వం 139లో 3 ఎకరాల 13 గుంటలు కేటాయించిందన్నారు. అతడు మైసమ్మ తల్లి ఆలయం ఉన్న ప్రధాన రోడ్డుకు భూమి కావాలని అడుగుతుండటంతో అధికారులు సర్వే చేసేందుకు వచ్చారన్నారు. ఎన్నో ఏళ్లుగా ఆలయం పక్కన భూమి అడగడం సరైన పద్ధతి కాదన్నారు. గ్రామంలో చాలా ప్రభుత్వ భూమి ఉందని, ఆలయం దగ్గర కాకుండా ఆయనకు ఎక్కడైనా స్థలం చూపించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఆలయం దినదినాభివృద్ధి చెందుతున్న క్రమంలో ఆలయం వద్ద భూమి ఎలా ఇస్తారని మండిపడ్డారు. పదేళ్లుగా ఈ వ్యవహారం సాగుతుండగా గ్రామస్తులం అడ్డుకుంటున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు పెద్ద సంఖ్యలో వచ్చి నిరసన తెలియజేశారు. అనంతరం సర్వే చేయకుండానే అధికారులు వెనుదిరిగారు.